RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 13 సంచిక : 270 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | బుధవారం, 2 ఏప్రిల్ 2025 | పేజీలు : 4 | వెల : 2/-

## కొలిక్కి రాని కొత్తమంత్రుల లెక్క!

# విస్తరణలో ట్విస్ట్..

## లిస్ట్ లోకి కొత్త పేర్లు!!




హైదరాబాద్ : షడ్రుచుల సమ్మేళనం ఉగాది నాడు ఆరుగురు మంత్రులెవరా? అన్నది తేలాల్సింది. కానీ జస్ట్ మిస్ అయ్యింది. ఇప్పుడా ఆరు మంత్రి పదువులు ఎవరికి కేటాయించినట్టు? ముందు వరుసలో ఉన్న వారులెవరు? ఎవరి పోరాటం ఇంకా కొనసాగుతూనే ఉంది? వారి వారి డిమాండ్లేంటి? కొత్త లిస్ట్ లో ఎవరెవరి పేర్లున్నాయ్? చూద్దాం.. కంప్లీట్ కేబినేట్ లిస్ట్ రిలీజయ్యేనా? లేక ఖాళీలుంటాయా? తెలంగాణ కాంగ్రెస్ లో ప్రస్తుతం మంత్రి వర్గ విస్తరణ వ్యవహారం హాట్ టాపిగ్గా మారింది. ఉగాదికల్లా ఆరుగురు మంత్రులకు పదవులు ఖాయమనుకున్న ఆశావహుల ఆశలు.. ఒక్కసారిగా వాయిదా పడ్డాయి. ఏప్రిల్ మూడు అన్నారు కానీ అది కూడా సాధ్యం కాదంటున్నారు. అయితే ఎట్టకేలకు ఫస్ట్ వీక్ లో లిస్ట్ రిలీజ్ అవుతుందని మాత్రం చెప్పుకుంటున్నారు. అయితే ఆరు బెర్తులకు గానూ ఐదింటి ఎంపిక పూర్తయినట్టుగా తెలుస్తోంది. మరొక పదవిపై మాత్రమే ఇంకా కసరత్తు నడుస్తున్నట్టు తెలుస్తోంది. ఈ దిశగా పార్టీ అంతర్గత వర్గాల్లో చర్చ జోరుగా సాగుతోంది. ఇప్పటికే రాష్ట్ర నేతలు తమ అభిప్రాయాలను అధిష్టానానికి తెలియ చేశారట. సామాజిక వర్గ సమీకరణాల దృష్ట్యా ఎవరికిస్తే బావుంటుందో ఫుల్ క్లారిటీ ఇచ్చారట. కేబినెట్ విస్తరణలో ఇటీవల జరిగిన మీటింగే ఫైనల్ మీటింగ్ అన్న మాట కూడా వినిపిస్తోందట. ఖరారైన వారిలో ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి వివేక వెంకట స్వామి, ఉమ్మడి నిజామాబాద్ నుంచి సుదర్శన్ రెడ్డి, ఉమ్మడి మహబూబ్ నగర్ నుంచి ముదిరాజ్ కోటాలో వాకిట శ్రీహరి. ఉమ్మడి నల్గొండ నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. ఇక మైనార్టీల నుంచి ఎమ్మెల్సీ అమీర్ అలీ కాన్ కి ఛాన్స్ ఇచ్చేలా తెలుస్తోంది. మిగిలిన ఒక బెర్తు కోసం ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికైన విజయశాంతి పేరు వినవస్తోంది. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు సైతం పోటీలో ఉన్నట్టు సమాచారం. ఇదంతా ఇలాగుంటే.. %ూ% కోటాలో ఒకరికి డిప్యూటీ స్పీకర్ ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. అలాగే రంగారెడ్డి జిల్లా నుంచి మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారట. ఈ ప్రాంతం నుంచి ఒక రెడ్డి నేతకు చీఫ్ విప్ ఇచ్చేలా తెలుస్తోంది. ఈ దిశగా పార్టీలో జోరుగా చర్చ సాగుతోందట. అయితే ఎస్టీ కోటాలో కొందరు ఆశావహులు తమకు బెర్త్ ఖాయం అంటూ వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారట. తమకంటే తమకు ఛాన్సులివ్వాలని అధిష్టానానికి విజ్ఞప్తులు చేస్తున్నారట. వీరిలో ఎవరికి దక్కుతుందనే స్పష్టత రాకున్నా తమ ఆశలైతే పెంచుకుంటూ వస్తున్నారట. మరి ఇప్పటికైనా కేబినేట్ కంప్లీట్ గా ఫుల్ ఫిల్ చేస్తారా? లేక ఏవైనా ఒకటి రెండు ఖాళీలతో కొత్త లిస్టు విడుదలవుతుందా? ఇంకా తేలాల్సి ఉందంటున్నారు. మొత్తంగా ఏప్రిల్ తొలివారానికల్లా.. కేబినేట్ విస్తరణ జరిగేనా? జరిగితే ఆరు పదవులనూ భర్తీ చేస్తారా? లేదా తేలాల్సి ఉందంటున్నారు.




హైదరాబాద్: అబద్ధాల మీదే బతుకుతున్న కొన్ని రాజకీయ పార్టీలు కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో అడ్డగోలుగా వ్యవహరిస్తూ దుష్ప్రచారం చేస్తున్నాయని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విమర్శించారు. ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉన్న ప్రభుత్వ భూములను వెనక్కి తెచ్చుకోవాలని.. పదేళ్లు పాలించిన భారాస ఎలాంటి ప్రయత్నాలు చేయలేదన్నారు. ఈ మేరకు సచివాలయంలో మంత్రులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడారు. "హెచ్‌సీయూ నుంచి భూములను లాక్కొని రాష్ట్ర ప్రభుత్వం అక్కడ ఏవో వెంచర్లు, ప్లాట్లు వేసి అమ్ముకునేందుకు ప్రయత్నిస్తోందని ప్రచారం చేస్తున్నారు. 13-1-2024 వరకు ఈ 400 ఎకరాలు హెచ్‌సీయూ పరిధిలోనే ఉందని వర్సిటీ భావిస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో తెదేపా ప్రభుత్వం ఉన్న సమయంలో ఈ 400 ఎకరాలను వర్సిటీ నుంచి తీసుకొని ఓ ప్రైవేటు సంస్థకు కేటాయించారు. ఆ 400 ఎకరాలకు బదలాయింపుగా వర్సిటీకి ఆనుకొని మరోవైపు ఉన్న 397 ఎకరాలు వర్సిటీకి కేటాయించారు. దానికి సంబంధించి ఆనాడు రెవెన్యూ అధికారులు, వర్సిటీ యాజమాన్యం కలిసి సంతకం చేసిన రికార్డులు ప్రభుత్వం వద్ద ఉన్నాయి. రాష్ట్ర ప్రజలు, వర్సిటీ విద్యార్థులకు ఈ విషయాలు తెలియాల్సిన అవసరం ఉంది. ఈ రికార్డులకు సంబంధించిన పత్రాలను మీడియాకు అందిస్తాం. ఈ అంశంలో కొన్ని రాజకీయ పార్టీలు కావాలనే దుష్ప్రచారం చేస్తూ ప్రజలు, విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తున్నాయి" "బదలాయింపులో భూమి దక్కించుకున్న వర్సిటీ బాగుంది. మరి ఓ ఫ్రాడ్ సంస్థకు కేటాయించిన ఆ 400 ఎకరాలు పరిస్థితి ఏంటి? అదంతా ప్రజల ఆస్తి. ప్రజలకే దక్కాలని ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. 21-11-2006లో వైఎస్ఆర్ నాయకత్వంలో ప్రైవేటు సంస్థకు ఇచ్చిన భూముల కేటాయింపును రద్దు చేసింది. మాకు ఇప్పటికే గత ప్రభుత్వం రాసి ఇచ్చింది.. ఇప్పుడు మీరు రద్దు చేస్తే ఎలా అని ఆ సంస్థ హైకోర్టులో రిట్ పిటిషన్ వేసింది. ఇది ప్రజల ఆస్తి.. ప్రజలకే ఉండాలనే నిర్ణయంతో ఆనాటి నుంచి పోరాడుతూ వస్తున్నాం.


ఆ తర్వాత రాష్ట్ర విభజన జరిగింది. పదేళ్ల భారాస పాలనలో ఏనాడూ ఆ భూములను వెనక్కి తెచ్చుకోవాలని ప్రయత్నాలు చేయలేదు. తిరిగి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రూ.వేల కోట్ల విలువైన భూమి ప్రభుత్వానికే చెందేలా పోరాటం చేయాలని కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నాం. హైకోర్టులో కొట్లాడి కేసు గెలిచాం. తెలంగాణ ప్రజల ఆస్తిని తిరిగి తెచ్చుకున్నాం. ఆ తర్వాతే టీజీఐఐసీ అధికారికంగా ప్రకటన విడుదల చేసింది. ఇది అభినందించాల్సిన విషయం" "ఈ 400 ఎకరాలను కాపాడి.. అక్కడ కూడా ఉద్యోగ అవకాశాలు లభించేలా ఒక కార్యాచరణ రూపొందించి ముందుకెళ్తున్నాం.

హైటెక్ సిటీ, హైటెక్ సిటీ ఫేజ్-2, నాలెడ్జ్ సిటీ వంటి వాటి ద్వారానే ఉపాధి పెరిగింది. అదే విధంగా యువతకు భారీ ఉపాధి అవకాశాలు కల్పించడమే మా ప్రభుత్వ లక్ష్యం. అప్పట్లో ఈ భూములను గాలికొదిలేశారు.. ఇప్పుడు దుష్ప్రచారం చేస్తున్నారు. హైదరాబాద్ అభివృద్ధి జరగాలి. సంపద సృష్టించాలి. ఉపాధి పెరగాలి. మేం పట్టించుకోకపోతే ప్రభుత్వ భూమి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లేది. 400 ఎకరాలు సాధించడం ఈ ప్రభుత్వ విజయం.. రాష్ట్ర ప్రజల విజయం" అని భట్టి పేర్కొన్నారు.



## భారాస బహిరంగ సభకు ప్రజలే స్వచ్ఛందంగా తరలివస్తారు: కేసీఆర్

హైదరాబాద్: భారాస రజతోత్సవ సభ కోసం జనం ఆతృతతో ఎదురుచూస్తున్నారని భారాస అధినేత కేసీఆర్ అన్నారు. పార్టీ బహిరంగ సభకు ప్రజలు స్వచ్ఛందంగా తరలివస్తారని చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పార్టీ నేతలతో కేసీఆర్ మంగళవారం సమావేశమయ్యారు. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు ఎల్కతుర్తిలో బహిరంగ సభకు భూమిపూజ చేయనున్నట్లు కేసీఆర్ వెల్లడించారు. సభకు వచ్చే జనానికి అనుగుణంగా విస్తృత ఏర్పాట్లు చేయాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ పాలన వింతంగా ఉందని కేసీఆర్ వ్యాఖ్యానించారు. మార్పు కోరుకున్న రైతుల కళ్లల్లో కన్నీళ్లే మిగిలాయన్నారు. రైతులకు ఈ దుస్థితి వస్తుందని కలలో కూడా తాను ఊహించలేదని చెప్పారు. ప్రభుత్వ చర్యలతో రైతులు, వివిధ వర్గాల ప్రజలు మనోధైర్యం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



# దక్షిణాది నుండే... కమలాధినేత...!

## బీజేపీ నూతన జాతీయాధ్యక్షుడు ఎవరు?.. రేసులో ఉన్నవారు వీరే..!

## తెలుగు రాష్ట్రాల నుండి కిషన్‌రెడ్డి, పురంధరేశ్వరి పేర్లు!

భారతీయ జనతా పార్టీ త్వరలో ఒక కీలక నిర్ణయం తీసుకోబోతున్నట్లు తెలుస్తోంది. పార్టీ తదుపరి జాతీయ అధ్యక్షుడు ఎవరనే విషయంపై త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. రాబోయే నెలల్లో బీహార్, పశ్చిమ బెంగాల్, అస్సాం, తమిళనాడు, కేరళ వంటి దక్షిణ భారత రాష్ట్రాలలో ఎన్నికలు జరగనుందని ఈ నిర్ణయం చాలా ప్రాముఖ్యతను సంతరించుకుంటుంది. సీఎం అయినా పార్టీ జాతీయాధ్యక్షుడి ఎంపిక అయినా.. ప్రధాని నరేంద్ర మోడీ, అమిత్ షా నేతృత్వంలోని బీజేపీ నిర్ణయాలను అంచనా వేయడం చాలా కష్టం. అయితే అధ్యక్ష పదవికి పోటీ పడే అవకాశం ఉన్న అభ్యర్థుల గురించి తెలుసుకుందాం. బీజేపీ జాతీయాధ్యక్షుడి పదవి కోసం కొన్ని పేర్లు వినిపిస్తున్నాయి. వారిలో జి.కిషన్ రెడ్డి, ధర్మేంద్ర ప్రధాన్, భూపేంద్ర యాదవ్, మనోహర్ లాల్ ఖట్టర్, శివరాజ్ సింగ్ చౌహాన్, డి.పురంధేశ్వరి, వానతి శ్రీనివాసన్ పేర్లు మాత్రమే కాకుండా మరికొందరి పేర్లు వినిపిస్తున్నాయి. వీరిని జాతీయాధ్యక్షుడి పదవికి ఎందుకు ఎంపిక చేస్తారో విశ్లేషిద్దాం. మొదటి కీలక అంశం ఏమిటంటే ప్రాంతం. ప్రాంతం ఆధారంగా జాతీయాధ్యక్షుడిని నియమించే అవకాశం ఉంటుంది. త్వరలో దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కేరళలో ఎన్నికలు జరగనున్న తరుణంలో దక్షిణాది నుంచి జాతీయ అధ్యక్షుడిని ఎంపిక చేస్తారా అనే సందిగ్ధం కలుగుతోంది. రెండో అంశం లింగం. బీజేపీకి ఇప్పటివరకు మహిళా జాతీయాధ్యక్షులు లేరు. మోడీ ప్రభుత్వం మొదటి సారిగా మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకువచ్చింది. ఆ తర్వాత ఢిల్లీకి కూడా ఒక మహిళా ముఖ్యమంత్రిని ఇచ్చింది. ఈ క్రమంలో ఈ సారి మహిళా జాతీయాధ్యక్షురాలిని నియమిస్తారా అనే అనుమానం కలుగుతోంది. మూడో అంశం విధేయత, సంస్థాగత అనుభవం. పార్టీ వ్యవహారాలు అన్ని తెలిసి ఉన్న వ్యక్తితో పాటు తమ సామర్థ్యాన్ని నిరూపించుకున్న వ్యక్తులకు ప్రధాని మోడీ, అమిత్ షాలు ఈ కీలక బాధ్యతను అప్పగించే అవకాశం ఉంటుంది. నాలుగో అంశం ఆర్ఎస్ఎస్ ఆమోదం. మహారాష్ట్ర, హర్యానా, ఢిల్లీలలో పార్టీ విజయంలో సహకరించిన , ముఖ్యమంత్రి ఎంపికలో కీలక పాత్ర పోషించిన ఆర్ఎస్ఎస్ ఆమోదం కూడా బీజేపీ జాతీయాధ్యక్షుడి తుది ఎంపికకు కీలకం అవుతుంది.

**పోటీలో ఉన్న పేర్ల గురించి చర్చిద్దాం..** జి కిషన్ రెడ్డి: దక్షిణాది నుంచి బీజేపీ జాతీయాధ్యక్షుడిని ఎంపిక చేస్తే మొదటి స్థానంలో జి.కిషన్ రెడ్డి ఉంటారు. బీజేపీ చివరిసారిగా రెండు దశాబ్దాల క్రితం దక్షిణ భారతం నుంచి జాతీయాధ్యక్షుడిని ఎంపిక చేసింది. ఏపీ నుంచి వెంకయ్యానాయుడు, అంతకుముందు దాదాపు ఒక సంవత్సరం పాటు దక్షిణాది నుంచి బంగారు లక్ష్మణ్, జానా కృష్ణమూర్తిలను అధ్యక్షులుగా బీజేపీ నియమించింది. కిషన్ రెడ్డి తెలంగాణకు చెందిన వారు. ప్రస్తుతం కేంద్ర మంత్రిగా సేవలందిస్తున్నారు. గత 45 సంవత్సరాలుగా పార్టీలో ఉన్నారు. భారత జనతా యువ మోర్చా అధ్యక్షుడి నుంచి ఎమ్మెల్యే, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ పదవులను నిర్వహించారు. ఆయన తెలంగాణలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కూడా సేవలందించారు. అంతకు ముందు బండి సంజయ్ పార్టీ అధ్యక్షుడిగా సేవలందించిన సంగతి తెలిసిందే. బీజేపీ దక్షిణాదిలో విస్తరించాలని చూస్తోంది. కాబట్టి దక్షిణాది నుంచి జాతీయాధ్యక్షుడిని ఎంపిక చేయడం తెలివైన పని. మరో విషయం ఏంటంటే.. కిషన్ రెడ్డికి ప్రధాని మోడీతో చాలా అనుబంధం ఉంది. ఇద్దరూ 1993లో అమెరికాను సందర్శించారు.

**ఈ సారి మహిళా అధ్యక్షురాలు రానున్నారా?...** ఈ సారి బీజేపీ మహిళా అధ్యక్షురాలిని చేయాలనుకుంటే బీజేపీ మహిళా మోర్చా చీఫ్ వానతి శ్రీనివాసన్ మొదటి స్థానంలో ఉన్నట్లు తెలుస్తోంది. వానతి శ్రీనివాసన్ తమిళనాడులోని కోయంబత్తూరు సౌత్ నుంచి ఎమ్మెల్యేగా కూడా ఉన్నారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో కమల్ హాసన్ ను ఓడించారు. వచ్చే ఏడాది కీలకమైన దక్షిణాది రాష్ట్రంలో ఎన్నికలు జరగనున్నందున.. వానతి శ్రీనివాసన్ పేరు కీలకంగా వినిపిస్తోంది. బీజేపీ వర్గాల్లో వినిపిస్తున్న మరో మహిళ పేరు లోక్ సభ ఎంపీ, ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు డి.పురంధేశ్వరి. చాలా మంది ఆమెను "దక్షిణాది సుష్మా స్వరాజ్ " అని కూడా పిలుస్తారు. ఆమె ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు కుమార్తె కూడా. ఆమె ప్రస్తుత ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి సతీమణి సోదరి కూడా. చంద్రబాబు ఎన్డీయేకు కీలక మిత్రుడిగా కూడా ఉన్నారు. ఈ ఇద్దరు మహిళలు దక్షిణాది నుంచి వచ్చారు. ఇది ప్రాంతీయ పరంగా కలిసొచ్చే అంశం.

**మనోహర్ లాల్ ఖట్టర్, శివరాజ్ సింగ్ చౌహాన్:** కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, శివరాజ్ సింగ్ చౌహాన్ లు కూడా ఈ జాతీయాధ్యక్షుడి బరిలో ఉన్నారు. వీరికి ఆర్ఎస్ఎస్ మద్దతు కూడా ఉంది. మనోహర్ లాల్ ఖట్టర్ ప్రధాని నరేంద్ర మోడీకి సన్నిహితుడు. ప్రధానమంత్రి ఒకసారి హర్యానాలో ఖట్టర్ తో కలిసి సైకిల్ తొక్కడంతో పాటు ఆర్ఎస్ఎస్ ప్రచారక్ గా కూడా కలిసి పని చేశారు. మనోహర్ లాల్ ఖట్టర్ నిరాడంబరుడు, నిజాయితీపరుడు కాబట్టి ఆయనను హర్యానా ముఖ్యమంత్రిగా ప్రధానమంత్రి మోడీ ఎంపిక చేసుకున్నారని కూడా భావిస్తారు. ప్రస్తుత మోడీ ప్రభుత్వంలో ఆయన కేంద్ర మంత్రిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి ఎంపికలో ఆర్ఎస్ఎస్ పాత్ర ఉన్నందున.. ఖట్టర్ బలమైన అభ్యర్థి కావచ్చు. ఆయనకు ఉన్న ఏకైక ప్రతికూల అంశం వయస్సు. ప్రస్తుతం ఆయన వయస్సు 70 సంవత్సరాలు. ఈ సమయంలో శివరాజ్ సింగ్ చౌహాన్ పేరు కూడా వినిపిస్తోంది. ఆయన చాలా సార్లు ముఖ్యమంత్రిగా ఉన్నారు కానీ 2023లో మధ్యప్రదేశ్ లో గెలిచిన తర్వాత ఆయన ముఖ్యమంత్రి కాలేదు. కేంద్ర వ్యవసాయ మంత్రి కేంద్ర కేబినెట్ లోకి తీసుకోబడ్డారు. ఆయనకు ఆర్ఎస్ఎస్ తో సుదీర్ఘ అనుబంధం ఉంది. ఆయన తన 13వ ఏటానే ఆర్ఎస్ఎస్ లో చేరిపోయారు. నిర్వహణలో ఎంతో అనుభవం ఉన్న శివరాజ్ సింగ్ చౌహాన్ కు ఇటీవల ప్రధాన మంత్రి కేంద్ర పథకాల పర్యవేక్షణ బాధ్యతను అప్పగించారు. 66 ఏళ్ల వయస్సు ఉన్న ఆయన పేరు కూడా ఈ రేసులో ఉన్నట్లు తెలుస్తోంది.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## అమెరికా వర్సెస్ ఇరాన్ అణుయుద్ధం తప్పదా?

అణ్వాయుధాల అభివృద్ధి విషయంలో ఇరాన్ మరియు అమెరికా మధ్య మళ్లీ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టెహ్రాన్‌కు తీవ్రమైన హెచ్చరికలు జారీ చేయడంతో పరిస్థితి మరింత దిగజారింది. అణు ఒప్పందానికి అంగీకరించని పక్షంలో ఇరాన్‌పై బాంబు దాడులు చేసేందుకు కూడా వెనుకాడబోమని ట్రంప్ తేల్చి చెప్పడంతో టెహ్రాన్ అప్రమత్తమైంది. తాజా సమాచారం ప్రకారం, ఇరాన్ తన క్షిపణులను సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. స్థానిక మీడియా కథనాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. టెహ్రాన్ టైమ్స్ కథనం ప్రకారం, ఇరాన్ దేశవ్యాప్తంగా ఉన్న భూగర్భ ప్రయోగ కేంద్రాల వద్ద పెద్ద సంఖ్యలో క్షిపణులను లాంచ్‌ప్యాడ్‌లపై సిద్ధంగా ఉంచింది. వైమానిక దాడుల కోసం వీటిని ప్రయోగించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఒకవేళ అత్యవసర పరిస్థితులు ఎదురైతే, అమెరికాకు సంబంధించిన ప్రాంతాలపై దాడులు చేసేందుకు ఈ క్షిపణులను ఉపయోగించనున్నట్లు ఆ కథనం పేర్కొంది. ఈ పరిణామం మధ్యప్రాచ్యంలో మరింత ఆందోళన కలిగిస్తోంది. అణు ఒప్పందం విషయంలో అమెరికా ప్రత్యక్ష చర్చలకు ఆహ్వానించగా, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ దానిని తిరస్కరించారు. అయితే, పరోక్షంగా చర్చలు జరిపేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. దీనిపై స్పందించిన డొనాల్డ్ ట్రంప్ ఒక మీడియా సంస్థతో మాట్లాడుతూ టెహ్రాన్‌ను తీవ్రంగా బెదిరించారు. "ఒకవేళ అణు ఒప్పందం కుదుర్చుకోవడానికి టెహ్రాన్ నిరాకరిస్తే, బాంబు దాడులు తప్పవు. ఆ దేశం మునుపెన్నడూ చూడని స్థాయిలో ఈ దాడులు ఉంటాయి. అంతేకాకుండా, వారు మరోసారి తీవ్రమైన ఆంక్షలు ఎదుర్కోవలసి ఉంటుంది" అని ట్రంప్ హెచ్చరించారు. అయితే, ఇరాన్‌తో పరోక్ష చర్చలకు ఆయన అంగీకరిస్తారా లేదా అనే విషయంపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా తీవ్ర దుమారం రేపుతున్నాయి. ట్రంప్ మొదటిసారి అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఇరాన్‌తో సంబంధాలు పూర్తిగా క్షీణించాయి. 2018లో ఆయన అధ్యక్షుడిగా ఉన్నప్పుడే అమెరికా అణు ఒప్పందం నుంచి ఏకపక్షంగా వైదొలిగింది. అంతేకాకుండా, టెహ్రాన్‌పై అనేక ఆంక్షలు విధించింది. అప్పటి నుంచి ఇరు దేశాల మధ్య ఎన్నోసార్లు పరోక్ష చర్చలు జరిగినప్పటికీ, అవి ఫలప్రదం కాలేదు. ఈ నేపథ్యంలో, ఇటీవల డొనాల్డ్ ట్రంప్ మరోసారి అణు ఒప్పందం కుదుర్చుకునేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. అయితే, ఆయన షరతులు మరియు హెచ్చరికలు ఇరాన్‌ను మరింత ఆగ్రహానికి గురిచేస్తున్నాయి. ఇరాన్ మాత్రం తమ క్షిపణి కార్యక్రమాన్ని సమర్థించుకుంటోంది. తమ రక్షణ కోసం క్షిపణులు తప్పనిసరి అని ఆ దేశం వాదిస్తోంది. అమెరికా మరియు దాని మిత్రదేశాల నుంచి ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో, తమను తాము కాపాడుకునేందుకు క్షిపణులు సిద్ధంగా ఉంచుకోవడం సరైన చర్యేనని ఇరాన్ పేర్కొంటోంది. అయితే, అంతర్జాతీయ సమాజం మాత్రం ఇరాన్ చర్యలను ఆందోళనకరంగా పరిగణిస్తోంది. అణు ఒప్పందం విషయంలో నెలకొన్న ప్రతిష్టంభన మరియు ఇరు దేశాల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు ప్రపంచ శాంతికి ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. ట్రంప్ యొక్క కఠినమైన వైఖరి మరియు ఇరాన్ యొక్క ప్రతిస్పందన చూస్తుంటే, రాబోయే రోజుల్లో ఈ పరిస్థితి మరింత క్లిష్టంగా మారే అవకాశం కనిపిస్తోంది. అణు ఒప్పందం విషయంలో ఇరు దేశాలు ఒక పరిష్కారానికి వస్తాయా లేదా అనేది వేచి చూడాలి. అయితే, ప్రస్తుత పరిస్థితులు మాత్రం మధ్యప్రాచ్యంలో శాంతి మరియు భద్రతకు పెను సవాలుగా నిలుస్తున్నాయి. అంతర్జాతీయంగా పలు దేశాలు ఈ ఉద్రిక్తతలను తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ, ఫలితం మాత్రం ఇంకా అస్పష్టంగానే ఉంది.

## ప్రభుత్వ నిర్ణయం.. వస్త్ర పరిశ్రమకు ఊతం



సిరిసిల్ల: మరమగ్గాల వస్త్రోత్పత్తి పరిశ్రమను ఆదుకునేందుకు ప్రభుత్వం నిర్మాణాత్మక చర్యలు ప్రారంభించింది. కుటీర పరిశ్రమకు విద్యుత్తు లోడు సామర్థ్యం 10 నుంచి 25 హెచ్‌పీలకు 50శాతం రాయితీని ప్రకటించింది. ఈ రాయితీతో ఉమ్మడి జిల్లాలో సుమారు 28 వేల నేత కుటుంబాలకు లబ్ధి చేకూరుతుంది. వీటిపై నాలుగు వేల మంది ఆసాములు, పదివేల మంది కార్మికులతోపాటు ఇతర అనుబంధ రంగాల వారు పనిచేస్తున్నారు. వస్త్ర పరిశ్రమలోని అధునాతన యంత్రాలు వాడుకునే నేతన్నలకు దీనివల్ల కరెంటు ఛార్జీల భారం తగ్గుతుంది. ఫలితంగా వారి వస్త్రోత్పత్తుల సామర్థ్యం పెంచుకునేందుకు దోహదపడుతుంది. ఎస్ఎస్ఐ యూనిట్లు, టెక్స్‌టైల్ పార్కులోని పరిశ్రమలకు రాయితీ వర్తించదు. లోడు సామర్థ్యం పెంపుపై నేతన్నల్లో హర్షం వ్యక్తమవుతోంది.

**క్షేత్ర స్థాయిలో సర్వే**

రాష్ట్రవ్యాప్తంగా 2018-19లో చేనేత, మరమగ్గాలపై సర్వే చేసి, ప్రతి మరమగ్గాన్ని జియోట్యాగ్ చేశారు. కుటీర పరిశ్రమలు, ఎస్ఎస్ఐ యూనిట్లు వేర్వేరుగా నమోదు చేశారు. రాయితీ పెంచడంతో ఒక్కో కారా?నాలో సగటున 40 సాధారణ మగ్గాల వరకు రాయితీ పొందడానికి అవకాశముంటుంది.


**నెరవేరిన హామీ**

ప్రభుత్వం విద్యుత్తు రాయితీ ఇవ్వడంతో కార్మికులు రాత్రింబవళ్లు పని చేసుకోవడానికి వెసులుబాటు కలుగుతుంది. గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని ప్రభుత్వం ఇప్పుడు నెరవేర్చడంతో నేతన్నల్లో ఆనందం వ్యక్తమవుతోంది. సిరిసిల్లలో 3,573 విద్యుత్తు సర్వీసులకు 25 యూనిట్ల రాయితీ వర్తిస్తుందని సెస్ అధికారులు పేర్కొన్నారు. బోయినపల్లి, కోనరావుపేట, కరీంనగర్ జిల్లా కొత్తపల్లి, గర్శకుర్తితోపాటు పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్, ఎలిగేడు, జగిత్యాల జిల్లాలోనూ ఇళ్లలో మగ్గాలు పెట్టుకుని వస్త్రాలు నేస్తున్నారు.

రాయితీ విడుదలలో జాప్యం

ఉమ్మడి జిల్లాలో కుటీరపరిశ్రమగా గుర్తింపు పొందిన మరమగ్గాలకు 2014 నుంచి ప్రభుత్వం రాయితీ బకాయిలు విడుదల చేయడం లేదు. సిరిసిల్లలో సెస్‌కు రూ.54.09 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. అదికాకుండా 127 ఎస్ఎస్ఐ యూనిట్లు కేటగిరీ మార్పు చేశారు. ఇందులో 744 సర్వీసులకు సంబంధించిన రూ.32 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. టెక్స్‌టైల్ పార్కులోని పరిశ్రమలకు ప్రభుత్వం బిల్లులపై 50 శాతం రీయింబర్స్‌మెంటు రూపంలో చెల్లిస్తుంది. డిసెంబరు 2020 వరకు ప్రభుత్వం విద్యుత్తు రియంబర్స్‌మెంటు విడుదల చేసింది. జనవరి 2021 నుంచి విడుదల చేయాలని టెక్స్‌టైల్ పార్కులోని వస్త్రోత్పత్తిదారులు ప్రభుత్వాన్ని కోరుతూ వస్తున్నారు.

## పంట కాల్వలు కనుమరుగు



ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ శివారులోని జక్కుల చెరువు కింద రాచర్ల బొప్పాపూర్, రాచర్ల గొల్లపల్లి గ్రామాల్లో కలిపి 494 ఎకరాల ఆయకట్టు ఉంటుంది. రాచర్ల గొల్లపల్లి వద్ద ఆయకట్టు భూములకు సాగునీటిని అందించే కాల్వ ఇది.. సుమారు 15 సంవత్సరాల క్రితం భారీ వెడల్పు, లోతుతో ఉండే ఈ కాల్వలో యువకులు ఈత కొట్టేవారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఇళ్లు, ఇతర నిర్మాణాలను చేపడుతుండటంతో అక్కడి భూముల ధరలు అమాంతం పెరిగిపోయాయి. కాల్వ క్రమంగా కబ్జాకు గురవుతోంది. కాల్వ సన్నగా మారి సాగునీరు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

**నిర్వహణ లేక...**

వ్యవసాయానికి జీవనాధారం సాగునీటి వనరులే. ఇవి జలకళను సంతరించుకుంటేనే భూగర్భజల మట్టాలు వృద్ధిచెంది ఏడాది పొడవునా పంట పొలాలకు నీరందుతుంది. ఎగువ ప్రాంతంలోని వరదనీటిని చెరువులు, కుంటల్లోకి చేర్చే పిల్ల కాల్వలు, నీటి వనరుల కింద భూములకు నీటిని అందించే పంట కాల్వలు నిరాదరణకు గురవుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో క్రమంగా కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంటోంది.

**పిల్ల కాల్వలు మాయం**

సుమారు 4,72,329 ఎకరాల భౌగోళిక విస్తీర్ణం కలిగిన రాజన్న సిరిసిల్ల జిల్లాలో దాదాపుగా 2,90,380 ఎకరాలు సాగుకు యోగ్యమయ్యే భూములు ఉన్నాయి. బోర్లు, బావులే సాగుకు ప్రధాన జీవనాధారం. చెరువులు, కుంటల కింద సుమారు 15,175 హెక్టార్లు, బోర్లు, బావుల కింద దాదాపు 35,212 హెక్టార్లు, మరో 45,400 హెక్టార్లు వర్షాధారంపై సాగవుతాయని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో 650కి పైగా చెరువులున్నాయి. దాదాపు 12వేల కిలో మీటర్ల పొడవునా పెద్ద కాలువలు విస్తరించి ఉండగా పిల్ల కాల్వలు అంతకు రెట్టింపుగానే ఉంటాయి.

కాల్వలను పునరుద్ధరించాలి

జిల్లాలో ఒకప్పటి పంట కాల్వలు కబ్జాకు గురై, మాయమవుతున్నాయి. గ్రామ పొలిమేరల్లో భూముల్లో కాల్వలను సైతం కలుపేసుకొని, ప్లాట్లుగా మార్చేస్తున్నారు. కాల్వలు లేక వ్యవసాయ పొలాలకు సాగునీరు అందని దుస్థితి నెలకొంది. ఏయే ప్రాంతాల్లో ఎంత పరిమాణంలో కాల్వలు ఉన్నాయో అధికారులు గుర్తించాలి. తిరిగి వాటిని పునరుద్ధరించాలి.
ప్రభాకర్‌రెడ్డి, రైతు, రాచర్ల బొప్పాపూర్

రైతులే పూడ్చుకుంటున్నారు

చెరువులు, కుంటల నుంచి వచ్చే సాగునీటితో వ్యవసాయం చేసేవారు. ఇప్పుడు బోరుబావులతో పంటలను సాగుచేస్తున్నారు. చెరువులు, కుంటల్లో నీరుంటే చాలంటూ అప్పట్లో ఉన్న పంట కాల్వలను కొందరు రైతులే పూడ్చివేసుకుంటున్నారు. అమరేందర్‌రెడ్డి, నీటిపారుదలశాఖ ఈఈ

## మరోసారి వడపోత

సూర్యాపేట : జిల్లాలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు అందజేసే పథకానికి ఇటీవల అడుగులు పడ్డాయి. జనవరి 26న మండలానికి ఒకటి చొప్పున పైలట్ ప్రాజెక్టు కింద 23 గ్రామాలను ఎంపిక చేసి 4,292 మంది లబ్ధిదారులకు ఇంటి నిర్మాణానికి సంబంధించి ధ్రువపత్రాలు అందజేశారు. అనంతరం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ప్రక్రియ నిలిచిపోయింది. కోడ్ ముగిసి రోజులు గడుస్తున్నా నేటికీ ఇంటి నిర్మాణానికి సంబంధించి నిధులు మంజూరు కాకపోవడంతో కార్యరూపం దాల్చలేదు. ఇదిలా ఉండగా మిగతా గ్రామాల్లో దరఖాస్తులు అధికంగా ఉండటంతో తిరిగి అర్హుల గుర్తింపునకు పునఃపరిశీలన చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సర్వే ఆధారంగానే లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. జిల్లాలోని 23 మండలాల్లో, 486 గ్రామ పంచాయతీల్లో మొత్తం 3,03,525 మంది దరఖాస్తు చేసుకున్నారు. కాగా అందులో పలు విభాగాలను గుర్తించారు. ఇల్లు లేని, స్థలం ఉన్న వారిని ఎల్-1 కింద, ఇల్లు, స్థలం లేని వారిని ఎల్-2 కింద, రేకుల ఇల్లు ఉండి, ట్రాక్టర్, ఇతర రుణాలు తీసుకున్న వారిని ఎల్-3 కింద విభజించారు. అందులో తొలుత ఎల్-1 లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇంటికి అర్హులుగా గుర్తించారు. కాగా జిల్లాలో నియోజకవర్గానికి 3,500 చొప్పున మందికి కేటాయిస్తామని గతంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కాగా ఎల్-1 విభాగంలో అధికంగా



ఉండటంతో తిరిగి పునఃపరిశీలన కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఈ ప్రక్రియ జిల్లాలో ముమ్మరంగా సాగుతోంది. పరిశీలన అనంతరం నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించనున్నారు. నివేదిక ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేసి ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించనున్నారు. కాగా ఇప్పటికే పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన లబ్ధిదారులు పునాదులు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. అందుకు నేటికీ ఎలాంటి ప్రకటన రాకపోవడంతో లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు..- ధర్మారెడ్డి, హౌజింగ్ ప్లానింగ్, ఈఈ, సూర్యాపేట నిబంధనల మేరకు అర్హులను గుర్తించేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు పునఃపరిశీలన చేపడుతున్నాం. ఈ ప్రక్రియ ముగియగానే ప్రభుత్వానికి నివేదిస్తాం. పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన వారికి ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది.

## మత్తు.. వదిలేదేలా!

మేడిపల్లి: గంజాయి సరఫరాపై పోలీసులు నిఘా పెంచుతున్నా విక్రయాలు ఆగడం లేదు. బాలుర నుంచి యువకుల వరకు బానిసలుగా మారుతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు పొరుగు జిల్లాల నుంచే కాకుండా పక్క రాష్ట్రాల నుంచి గంజాయి సరఫరా అవుతోంది. సరఫరాదారులు, విక్రేతలు, తాగిన వారిపై కూడా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. అయినా రోజురోజుకూ కేసులు పెరుగుతున్నాయి.

**బాలలపై ప్రభావం**

ముక్కుపచ్చలారని బాలలపై గంజాయి ప్రభావం చూపుతోంది. చాలా పాఠశాలలు, కళాశాలల సమీపాల్లో గంజాయి అమ్మకాలు జరుపుతుండటంతో బానిసలవుతున్నారు. జగిత్యాల జిల్లా నుంచి గంజాయి విక్రేతల కోసం నిజామాబాద్‌కు వెళ్లిన పోలీసులకు బాలురు గంజాయి అమ్ముతుండటం విస్మయం కలిగించింది. చాలా మంది బాలురు గంజాయికి అలవాటు పడి పలు నేరాలకు కూడా పాల్పడుతున్నారు. జగిత్యాలలో ఓ కేసులో బాలికకు గంజాయి అలవాటు చేసినట్లు తెలిసి అధికారులు హతాశులయ్యారు. చాలా నేరాల్లో బాలలు కేవలం గంజాయి ప్రభావంతోనే పాల్గొన్నట్లు చెబుతుండటం దాని తీవ్రతకు అద్దం పడుతోంది. బాలురతో పాటు యువకులు వాహనాలు అతివేగంగా నడపటం, దాడులు, హత్యాయత్నాలు, నేరాలకు పాల్పడటం లాంటి ఘటనల్లో గంజాయి కూడా ఒక కారణంగా తెలుస్తోంది. జగిత్యాలలో ఓ వివాహ వేడుకలో యువకులు ఇతరులపై



దాడులకు పాల్పడిన ఘటనలో గంజాయి తాగినట్లు పోలీసులు నిర్ధారించారు. ఉమ్మడి జిల్లాలో పలు ఘటనల్లో గంజాయి ప్రభావం చూపినట్లు నిర్ధారణ కావడంతో పలు వర్గాల్లో చర్చనీయాంశమవుతోంది.

**సరఫరా అవుతోందిలా..**

ఆదిలాబాద్, నిజామాబాద్, మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిశా సరిహద్దుల నుంచి ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు గంజాయి సరఫరా అవుతోంది.
నిజామాబాద్ జిల్లా నుంచి బస్సులో గంజాయి సరఫరా చేస్తుండగా అనుసరించిన పోలీసులు నిందితులను పట్టుకున్నారు.
పెద్దపల్లి జిల్లాలో రైలుమార్గాల ద్వారా గంజాయి సరఫరా అవుతుందన్న విషయం తెలిసి పోలీసులు నిఘా పెంచారు.
కరీంనగర్ జిల్లాకు విశాఖపట్నం నుంచి కారులో సరఫరా అవుతున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు.
హైదరాబాద్ నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లాకు గతేడాది నుంచి గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు.

**కేసులు ఇలా..**


ఇటీవల మెట్‌పల్లికి చెందిన గోల్కొండ హరీశ్, బొల్లేపల్లి అభిషేక్‌ను మేడిపల్లి శివారులో పోలీసులు అరెస్టు చేశారు. ఒడిశా నుంచి గంజాయి తెచ్చి విక్రయిస్తుండగా పోలీసులు నిఘా వేసి పట్టుకున్నారు.
రామగుండం కమిషనరేట్ పరిధిలో ఇటీవల 120 కిలోల గంజాయిని పట్టుకున్నారు. జగిత్యాల గ్రామీణ పోలీస్ స్టేషన్ పరిధిలోని కండ్లపల్లిలో కులదీప్, పవన్‌కుమార్, రాకేశ్ అనే వ్యక్తులను ఫిబ్రవరిలో అరెస్టు చేసి వారి నుంచి 130 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
రాజన్న సిరిసిల్ల జిల్లాలో రెండు నెలల్లో 50 మందిని గంజాయి కేసుల్లో అరెస్టు చేశారు.

**పటిష్ఠ నిఘా-** రాములు, డీఎస్పీ మెట్‌పల్లి

గంజాయి అమ్మిన వారితో పాటు వినియోగించిన వారిపై చర్యలు తీసుకుంటాం. జిల్లా సరిహద్దుల్లో నిఘా ఉంచాం. ఇటీవల యువకులు, బాలలు గంజాయి బారిన పడుతున్నట్లు తెలుస్తోంది. స్వచ్ఛంద సంస్థల వారు గంజాయిపై అవగాహన కల్పించాలి. గంజాయి అమ్మిన వారి వివరాలు సమీప పోలీస్ స్టేషన్‌కు తెలిపితే చర్యలు తీసుకుంటాం. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

## కరవు తెచ్చిన పట్టుదల.. కన్నీటి నుంచి విడుదల

కరవు కోరలు చాచింది. వర్షాకాలంలోనే భూమి బీడుబారు తోంది. యాసంగికి అయితే తాగడానికి గుక్కెడు నీళ్లు దొరకని పరిస్థితి. కాలువ ఊళ్లోనుంచే వెళ్తున్నా.. చెరువులు మాత్రం నిండవు. ఆ గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు వివిధ హోదాల్లో ఉన్నా వీరి కన్నీటిని తుడవలేకపోయారు. దీంతో రైతాంగం సంఘటితమై సమస్యను పరిష్కరించుకున్నారు.
కనగల్ మండలం చిన్నమాదారం గ్రామ పంచాయతీ పరిధిలోని కుమ్మరిగూడెం, ఎర్రగూడెం గ్రామాల్లో రెండేళ్ల క్రితం వరకు పంటలు చివర వరకు పండిన దాఖలాలు లేవు. వందల అడుగుల లోతు బోర్లు వేసిన గంగమ్మ జాడ కనిపించేది కాదు. దీంతో పలువురు వ్యవసాయానికి దూరం అయ్యారు. మరికొందరు ఉన్న నీటితో తిప్పలు పడేవారు. దూరప్రాంతాల నుంచి ట్యాంకర్లతో నీటిని తెచ్చి



పంటలను కాపాడుకునే వారు. కాల్వ, ఎత్తిపోతల ద్వారా చెరువులు నింపాలని రైతులు ఎన్నో ఏళ్లుగా ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరిగినా.. వారిగోడు ఎవరికి పట్టలేదు.
దీంతో ఈ సమస్యను తామే పరిష్కరించుకోవాలని సంఘటితంగా కదిలారు. సొంత డబ్బుతో పాటు దాతల సహకారంతో మోటార్లకు తీసుకొచ్చారు. తలాపు నుంచి వెళ్తున్న కాలువకు వాటిని బిగించి ఎత్తిపోతల ద్వారా ఆయా చెరువులు, కుంటలను నింపారు. ఆ నీటిని నేరుగా సాగుకు వినియోగించకుండా భూగర్భ జలాలు పెంచుకున్నారు. రైతుల భగీరథ ప్రయత్నంతో నేడు ఆయా గ్రామాల్లో బావులు, బోర్లలో నీటి లభ్యత పెరిగింది. నాడు బీడు భూములుగా ఉన్న భూములు ప్రస్తుతం పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. రెండేళ్ల క్రితం ఎర్రగూడెం చెరువుకు మోటార్లు బిగించగా ఈఏడాది కుమ్మరిగూడెం చెరువును నింపుతున్నారు. ప్రభుత్వాల కోసం ఎదురు చూడకుండా సంఘటితంగా కరవును జయించిన ఈ అన్నదాతల పట్టుదల తోటి రైతులకు స్ఫూర్తిదాయకం.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక
బుధవారం 2 ఏప్రిల్ 2025

# నీరు నిలుపు.. సాగుకు మలుపు

తాండూరు : తాండూరు శివారులోని కాగ్నా నదికి వరదలొచ్చినప్పుడు ఆనకట్టలు లేక నీరంతా దిగువకు వృథాగా వెళ్లిపోయేది. కళ్లముందే పొలాలకు పారాల్సిన నీరు ఇలా నేలపాలవుతుంటే రైతులు తీవ్ర ఆవేదనకు లోనయ్యేవారు. అడ్డుకట్టలు కడితే కొంతమేరకైనా వృథాను అరికట్టవచ్చని నీరు నిలిచి పొలాలకు పారించి పంటలు పండించుకోవచ్చని రైతులు అధికారులకు పదేపదే విన్నవించేవారు. ఎట్టకేలకు వారి కృషి ఫలించింది. తాజాగా వరద నీరు వృథాగా పోకుండా అధికారులు ఆనకట్టలు నిర్మిస్తున్నారు.

రూ.10 కోట్లవ్యయం: ఇప్పటికే నదిలో దిగువ, ఎగువ రెండు ఆనకట్టల్ని నిర్మించారు. రూ.10 కోట్ల వ్యయంతో కొత్తగా కట్టలు నిర్మిస్తున్నారు. వర్షా కాలంలో కురిసే వానకు నదిలోకి భారీగా వచ్చే వరద నీరు వృథాగా అటుఇటూ వెళ్లకుండా మరో కట్టను నిర్మిస్తున్నారు. తాండూరు– కొడంగల్ మార్గంలోని వంతెనకు ఎగువన కొత్తగా నిర్మించిన ఆనటక్ట వద్ద వరద నీరు నిల్వటానికి అధికారులు రెండు వైపులా మరో కట్టను ఏర్పాటు చేస్తున్నారు. వరద నీరు వచ్చినప్పుడు ఇది వరకు నదీ పరివాహక ప్రాంతాల్లోకి వెళ్తూ పంట పొలాలను దెబ్బతీసేది. నదికి రెండు వైపులా కట్టలు ఏర్పాటు చేస్తుండటంతో



వరద నీరు ఆనకట్ట వద్దే నిల్వ ఉంటుంది.

**కొడంగల్‌కు మెరుగైన తాగునీటి సరఫరా..**

ఇక్కడి ఆనకట్ట నుంచే కొడంగల్ నియోజకవర్గానికి తాగు నీటిని సరఫరా చేస్తున్నారు. ఇందులో భాగంగానే నీటి సరఫరా మరింత మెరుగు కోసం ఆనకట్టకు రెండు వైపులా రెండు కిలో మీటర్ల పొడవునా కొత్తగా మట్టి కట్టలు ఏర్పాటు చేస్తున్నారు. పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వచ్చే వర్షా కాలం నాటికి పూర్తి చేసే విధంగా వేగంగా చేస్తున్నారు. నదిలోని మట్టినే తీసి కట్టలు ఏర్పాటు చేస్తున్నారు. నది మధ%రి%్యలో ఆనకట్ట, రెండు వైపులా మట్టి కట్టలతో వరద నీరు భారీగా నిల్వ ఉండటానికి అవకాశాలు ఉన్నాయి. దీంతో ఆ ప్రాంతంలో భూగర్భ జలాలు గణనీయంగా పెరిగి సాగు, తాగు నీటికి ఇబ్బందులు ఉండవని అధికారులు వివరిస్తున్నారు.

# పశుపోషకులకు బాసట

చొప్పదండి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పశువుల షెడ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గతంలో గ్రామీణాభివృద్ధి పనులకు ప్రాధాన్యమివ్వగా.. ఈసారి వాటికి భిన్నంగా వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి కృషి చేయాలని భావించింది. వేసవిలో జల సంరక్షణకు ఇంకుడుగుంతలు, చేపల కొలనుతోపాటు పాడి రైతుల కోసం ప్రత్యేకంగా షెడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నారు.

**నాలుగు పశువులు ఉంటేనే..**

గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు ఉపాధిహామీ జాబ్‌కార్డు కలిగి ఉండి కనీసం నాలుగు పశువులను కలిగి ఉంటేనే షెడ్ల నిర్మాణానికి అనుమతినిస్తారు. పశువుల షెడ్డుతోపాటు దాని పక్కనే తాగునీటి ట్యాంకు, పశుగ్రాసం నిల్వ చేసుకునేందుకు ప్రత్యేక గదిని సైతం నిర్మిస్తున్నారు. ఇప్పటివరకు చిన్న, సన్నకారు రైతులు తమ పశువులను పొలాల వద్ద చెట్ల కింద కట్టేసేవారు. దీంతో వాటి ఆరోగ్యంపై వాతావరణ పరిస్థితులు ప్రభావం చూపడంతో వ్యాధుల బారినపడేవి. ఈ సమస్యను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పశువుల షెడ్ల నిర్మాణానికి



అనుమతినివ్వడంతో వారి కష్టాలు తీరనున్నాయి.

**రూ.లక్ష వరకు కేటాయింపు**

జిల్లాలోని 15 మండలాల పరిధిలో 926 షెడ్ల నిర్మాణానికి అనుమతి రాగా.. ఇప్పటివరకు 336 నిర్మించారు. మిగతావి ప్రగతిలో ఉన్నాయి. ఈనెలాఖరు వరకు వీటన్నింటిని పూర్తి చేసేలా ఉపాధిహామీ సిబ్బంది కసరత్తు చేస్తున్నారు. ఈ దిశగా క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఒక్కో షెడ్డు నిర్మాణానికి రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు కేటాయిస్తున్నారు.

**సద్వినియోగం చేసుకోవాలి : శ్రీధర్, డీఆర్డీవో కరీంనగర్**

పాడి రైతులకు పశువుల షెడ్ల నిర్మాణంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి. వాటిని సద్వినియోగం చేసుకోవాలి. మార్చి 31 లోగా వీలైనన్ని పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నాం. ఇవి పాడి రైతుకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి.

# సన్నబియంతో సంతృప్తికరంగా భోజనం..!

కొత్తగూడెం: పేదలకు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఉగాది (ఈనెల 30) నుంచి రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం అందిస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల పౌరసరఫరాలశాఖ అధికారులు సన్నాహాలు మొదలుపెట్టారు. దారిద్ర్యరేఖకు దిగువనున్న లబ్ధిదారుకు ప్రస్తుతం ఆరు కిలోల చొప్పున దొడ్డు బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఇకపై వీటి స్థానంలో సన్నబియ్యం అందించనున్నారు. రైతుల నుంచి కొన్న సన్నధాన్యాన్ని మరపట్టించి తిరిగి నిరుపేదలకు పంపిణీ చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.అక్రమాలకు అడ్డుకట్ట.. ఇన్నాళ్లు 'రేషన్' లబ్ధిదారులకు ప్రతినెలా దొడ్డు బియ్యం పంపిణీ చేశారు. అయితే అందులో ఎక్కువ శాతం మంది వాటిని తినలేక దళారులకు విక్రయించటంతో పథకం లక్ష్యం నీరుగారేది. లబ్ధిదారులు మార్కెట్‌లో సన్న బియ్యాన్ని కొనుగోలు చేస్తుండటంతో వాటి ధరలకు రెక్కలొస్తున్నాయి. ఈనేపథ్యంలో రేషన్‌కార్డుల ద్వారా ఉచితంగా సన్నబియ్యం అందించాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. **ఏడు లక్షల కార్డులు.. 11వేల మె.ట. బియ్యం**ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో 7,05,950 రేషన్‌కార్డులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటికి ప్రతినెలా సుమారు 11వేల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమని అంచనా వేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులు ఇచ్చేందుకు, పాతకార్డుల్లో పేర్లు చేర్చేందుకు చర్యలు చేపట్టింది. దరఖాస్తుల విచారణ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. ఏప్రిల్‌లో కొత్తకార్డులు అందుతాయని ప్రజలు ఆశిస్తున్నారు. ఇదే జరిగితే ఖమ్మం, భద్రాద్రి జిల్లాల బియ్యం కోటా పెంచాల్సి ఉంటుంది. సుమారు 60 నుంచి 70వేల వరకు కార్డులు, 3లక్షల వరకు యూనిట్లు పెరిగే అవకాశం ఉన్నందున కనీసం 2వేల మెట్రిక్ టన్నుల బియ్యం అదనంగా కావాలి.

# వేలుపట్టి నడిపించినా.. వెలి



హైదరాబాద్: "హలో.. హైదరాబాద్‌లో రోడ్డుపక్కన ఉన్న మృతదేహం వద్ద దొరికిన సంచిలో మీ ఫోన్ నంబరుంది.. మీ నాన్న అనుకుంటా! మృతదేహాన్ని తీసుకెళ్తారా.." మాట పూర్తయ్యేలోపు ఫోన్ కట్. మళ్లీ చేస్తే స్విచ్ఛాఫ్.

"అమ్మా.. గాంధీ ఆసుపత్రి బయట మీ వాళ్లెవరో చనిపోయారు.." అని చెప్పగానే.. "మేం రాలేం.. అంత్యక్రియలు కానిచ్చేయండి.. ఫోన్ పే నంబరు చెబితే డబ్బు పంపుతాం. చితాభస్మం దాయాల్సిన పనిలేదు. వీలైతే ఆ మూసీలోనే కలిపేయండి." అంటూ సమాధానం.

ఆ తల్లికి నలుగురు సంతానం. ఏడుపదుల వయసులో అమ్మను భారంగా భావించారు. బంధువుల ఇంట్లో శుభకార్యమని కాకినాడ నుంచి హైదరాబాద్ తీసుకొచ్చారు. సనత్‌నగర్‌లో వదిలేసి మాయమయ్యారు. స్వచ్ఛంద సంస్థలో ఆశ్రయం పొందుతూ మానసిక వేదనతో కన్నుమూసింది. బిడ్డలకు సమాచారమిస్తే అంత్యక్రియలు మీరే చేసేయండి అంటూ చేతులు దులుపుకొన్నారు.

గ్రేటర్ పరిధిలో ఏటా 500లకు పైగా అనాథ మృతదేహాలను గుర్తిస్తున్నారు. అందులో అధికశాతం వృద్ధులే. పెంచి పెద్ద చేసిన పిల్లలే వారిని భారంగా భావిస్తున్నారు. ఆస్తిపాస్తులు రాయించుకొని నగరంలో వదిలేసి వెళ్లిపోతున్నారు. చనిపోయాక మృతదేహాల వద్ద దొరికిన ఫోన్ నంబర్లను సంప్రదించినా స్పందించకుండా కఠినంగా వ్యవహరిస్తుండటం దయనీయం.

**భారమని.. దూరంగా వదిలేసి**

బంజారాహిల్స్‌లోని దేవాలయం వద్ద కూర్చునే ఒక పెద్దాయన వయసు 68ఏళ్లు. భార్య మరణించాక ఇల్లు తన పేరిట రాయించుకున్న కొడుకు గెంటేయడంతో నగరంలో కూతురి ఇంటికి చేరాడు. అల్లుడి సూటిపోటి మాటలను భరించలేక.. భిక్షాటన చేస్తున్నాడు. రైతుగా గౌరవంగా బతికి ఇప్పుడిలా అభిమానం చంపుకొంటూ చేయిచాస్తున్నానంటూ కన్నీరు పెట్టుకున్నారు. వృద్ధాప్యం, ఆరోగ్య సమస్యలు, కుటుంబ తగాదాలు, ఆర్థిక ఇబ్బందులతో కన్నవారిని భారంగా భావించే బిడ్డలు వారిని వైద్యపరీక్షలు, దేవాలయాలు, పర్యాటక ప్రాంతాలు చూద్దామని చెప్పి నగరం తీసుకొస్తున్నారు. కొందరు మధ్యలోనే బస్సులు, రైళ్లలో వదిలేసి వెళ్లిపోతున్నారు. మరికొందరు ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేర్పించి తప్పుడు వివరాలిస్తున్నారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి గాంధీ, ఉస్మానియా, నిమ్స్ ఆసుపత్రులు, బస్సు, రైల్వేస్టేషన్లు, శివారుల్లో రోజూ 10 మంది వృద్ధులను వదిలేసి వెళ్తున్నట్టు పోలీసుల అంచనా.

**ఆ నలుగురు.. మోసేదెవ్వరు**

నగరంలో అనాథలుగా మరణించాక తలకొరివి పెట్టాల్సిన కుమారులను సంప్రదిస్తే వేం అందుబాటులో లేమంటూ సమాధానమిస్తున్నారు. రూ.20 కోట్ల ఆస్తులున్న పెద్దాయన.. కొద్దిరోజుల క్రితం రోడ్డుపక్కన మరణించాడు. మృతుడి జేబులోని ఫోన్ నంబర్‌కు సమాచారం అందిస్తే అంత్యక్రియలు ఖర్చులు పంపుతామంటూ ఫోన్ పెట్టేశాడంటూ ఒక ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఎంతో గొప్పగా జీవించి.. బంధువులు.. ఆత్మీయుల మధ్య సాగాల్సిన చివరిమజిలీ.. పాడె మోసేందుకు ఆ నలుగురు కూడా లేకుండా ఒంటరిగా బతుకు ముగిస్తున్నారు.

# బెదిరిస్తూ.. బెంబేలెత్తిస్తూ..



తాండూరు : ఖనిజాల ఖిల్లాగా పేరున్న తాండూరులో నాపరాళ్ల అక్రమ రవాణాను అడ్డుకోవాలంటే గనుల శాఖ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో తమ అధికారాలను వినియోగించి వాహనాలను అడ్డుకోవాలని చూస్తే బెదిరిస్తున్నారు. దాడులకూ తెగిస్తున్నారు. పోలీసులు వెంట ఉంటేనే విధులను నిర్వహించే పరిస్థితి నెలకొంటోంది. లేదంటే అక్రమ రవాణా యథాతథంగా సాగిపోతోంది.

**కర్ణాటక నుంచే ఎక్కువ**

తాండూరు మండలానికి చేరువలో కర్ణాటక రాష్ట్రం మిర్యాణం గ్రామం ఉంది. ఇక్కడ వేల ఎకరాల్లో నాణ్యమైన ముడి నాపరాళ్లు నిక్షిప్తమై ఉన్నాయి. ఇదే నాపరాయిని మిర్యాణ్‌లో ఉన్న చెక్‌పోస్టును తప్పించి తాండూరులోని యూనిట్లకు అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఇలా వచ్చిన ముడి నాపరాయిని నునుపుగా మార్చి ఆర్డర్ల మేరకు విక్రయించి లాభ పడుతున్నారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి తాండూరుకు చెందిన మరి కొందరితో చేతులు కలిపి వ్యవహారం నడిపిస్తున్నారు. ఇక తాండూరు మండలంలో లీజు పొందిన నాపరాళ్ల గనులు 60 ఉంటే అనుమతులు లేని గనులు పదుల సంఖ్యలో కొనసాగుతున్నాయి. గనుల శాఖ తరచూ తనిఖీలు నిర్వహించి యజమానులను హెచ్చరిస్తున్నా షరామామూలే.

**తెగించిన లారీ డ్రైవర్**

తాజాగా ఈనెల 24న రాత్రి తాండూరు మండలం గౌతాపూరు చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న సూర్యకాంత్ రెడ్డి 11.30 గంటల సమయంలో మిర్యాణం నుంచి తాండూరు వైపు వస్తున్న నాపరాళ్ల లోడ్ లారీని ఆపి డ్రైవర్‌ను రాయల్టీ పత్రాలను అడిగారు. డ్రైవర్ అతడిని కిందకు తోసేసి వెళ్లడంతో గాయాలకు గురయ్యాడు. విధులకు ఆటంకం కల్గించి గాయపరిచాడని పేర్కొంటూ కరణ్‌కోట పోలీస్ స్టేషన్‌లో ఏడీ సత్యనారాయణ సహాయంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అదే రోజు ఎఫ్ఐఆర్ చేశారు. జరిగిన ఘటనపై ఏడీ రాష్ట్ర ఉన్నతాధికారులకు విషయాన్ని చేర వేశారు. మంగళవారం హైదరాబాద్ రేంజ్ డిప్యూటీ డైరెక్టర్ గోవింద్‌రాజు తాండూరుకు చేరుకుని ఏడీ సత్యనారాయణతో కలిసి సూర్యకాంత్‌రెడ్డిని స్థానిక ఆసుపత్రిలో పరామర్శించారు. కేసు దర్యాప్తులో ఉంది.

తాండూరు, గౌతాపూర్, బషీరాబాద్ మోమిన్‌పేట తదితర ప్రాంతాల్లో వందలాది ఎకరాల్లో గనులు విస్తరించి ఉన్నాయి.

ఒక్క తాండూరులోనే 100కుపైగా ఎకరాల్లో నాపరాయి గనులున్నాయి. వీటిలో పగలూ, రాత్రి పనులు సాగుతుంటాయి. అక్రమ రవాణా కారణంగా ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీ రూ.కోట్లలో రాకుండా పోతోంది.

తవ్వకాలకు అనుమతులు పొందిన గనులు.. 228
అనుమతులు లేనివి.. 130
ఒక్కో గనిలో పనిచేసే కార్మికులు.. 10–20
సుద్ద, లేటరైట్, స్టోన్ మెటల్, నాపరాయి గనులు: 600 ఎకరాలు
నిత్యం అక్రమ రవాణా.. 50 లారీలు
డిమాండ్ ఉన్నవి.. సుద్ద, నాపరాయి, ఎర్రరాయి, స్టోన్‌మెటల్.

# వన్యప్రాణుల సంరక్షణపై దృష్టి



సారంగాపూర్: బీర్‌పూర్, ధర్మపురి మండలాల చివరి ఆయకట్టుకు నీరందించే లక్ష్యంతో చేపట్టిన బీర్‌పూర్ రోళ్లవాగు ఆధునికీకరణ పనుల్లో పురోగతి కనిపిస్తోంది. ప్రాజెక్టు పనులు 2017లో ప్రారంభించగా ఇప్పటి వరకు అటవీ అనుమతులు లేకపోవడంతో పూర్తికాలేదు. ఇటీవల రెవెన్యూ శాఖ భూములు అప్పగించగా అటవీ అనుమతులకు జిల్లా అటవీశాఖ అధికారులు నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించారు. ప్రస్తుతం ప్రాజెక్టు ఆధునికీకరణతో పర్యావరణం, వన్యప్రాణులు, అటవీ ప్రాంత నష్టం అంచనా తయారీకి ప్రత్యేకంగా అధ్యయనం చేసి నివేదించనున్నారు. ఇటీవల ప్రాజెక్టు ముంపు ప్రాంతాన్ని రాష్ట్ర అటవీ వనరులు, వన్యప్రాణుల సంరక్షణ అధికారి పరిశీలించగా అటవీ అనుమతుల కోసం రాష్ట్ర ఉన్నతాధికారులు రానున్నారు.

అటవీ, సహజ వనరుల నిర్వహణ అధ్యయనాల పరిశోధన విశ్వవిద్యాలయం(సీఈఎఫ్ఎన్ఏఆర్ఎం) అధికారులు, మంపునకు గురవుతున్న ప్రాంతాన్ని అధ్యయనం చేసి నష్టం అంచనా వేయనున్నారు. ఇందులో మొక్కలు, వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణానికి చేపట్టాల్సిన దానిపై అధ్యయనం చేయనున్నారు. ఇందుకు ప్రత్యేకంగా రూ.40 లక్షలతో సర్వే నిర్వహించి ఆధునికీకరణ చేపడుతుండంతో ముంపునకు గురవుతున్న ప్రాంతాన్ని గుర్తించనున్నారు. మూడు రకాలుగా వన్యప్రాణుల సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, అడవుల సంరక్షణగా విభజించి అటవీ సంపద పెంచేందుకు అవసరమైన నిధులు, చేపపట్టాల్సిన చర్యలపై నివేదిక తయారు చేసి పంపించనున్నారు.

**3.67 లక్షల మొక్కల పెంపకం**

ప్రాజెక్టు ఆధునికీకరణలో ముంపునకు గురవుతున్న అటవీభూములకు బదులుగా 335 హెక్టార్ల రెవెన్యూ భూములను పెగడపల్లి, వెల్గటూర్, గొల్లపల్లి మండలాల్లో అప్పగించడంతో ఆయా భూములను అటవీశాఖ స్వాధీనం చేసుకుంది. దీని ద్వారా ఆయా భూములతోపాటు పర్యావరణ, వనరుల సంరక్షణ కింద అటవీ శాఖ 3.67 లక్షల మొక్కల పెంపకం చేపట్టనుంది. ఇందులో ముందుగా అటవీ శాఖకు అప్పగించిన రెవెన్యూ భూములలో 80 వేల మొక్కలు నాటనుండగా, మిగతా మొక్కలు జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో నాటేందుకు ప్రతిపాదనలు తయారు చేశారు. అంతేకాకుండా అరుదుగా ఉండే తౌసీ, నల్లమద్దీ, టేకు భారీ వృక్షాలు ప్రాజెక్టు ముంపు ప్రాంతం నుంచి వేర్లతో సహా తరలించి సారంగాపూర్ మండలంలోని గణేష్‌పల్లె, బీర్‌పూర్ ఘాట్, జగిత్యాల అర్బన్ పార్కు ప్రాంతాల్లో నాటనున్నారు. అటవీ అనుమతులకు నివేదించాం– రవిప్రసాద్, డీఎఫ్‌వో, జగిత్యాల

ప్రాజెక్టు ఆధునికీకరణలో ముంపునకు గురవుతున్న అటవీ భూముల వివరాలు అటవీశాఖకు నివేదించాం. ముంపునకు గురువుతున్న భూములకు బదులుగా అందించిన వాటిలో అటవీ అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు తయారు చేసి పంపించాం. ఉన్నతాధికారులు పరిశీలించి ప్రభుత్వానికి నివేదించనున్నారు.

# వడ్డీ రాయితీ వచ్చేసింది

పొదుపు సంఘాల మహిళలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. సంఘాల ఆర్థిక బలోపేతానికి చేయూతనిస్తూ ఆర్థిక స్వావలంబనకు తోడ్పాటునందిస్తోంది. బ్యాంకుల నుంచి వడ్డీలేని రుణాలు తీసుకుని వాయిదాల ప్రకారం సక్రమంగా చెల్లించిన స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం వడ్డీ రాయితీ నిధులు మంజూరు చేస్తోంది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్ 2024 నుంచి జనవరి 2025 వరకు నిధులు విడుదల చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అర్హులైన సంఘాల ఖాతాలలో మంజూరైన నిధులను జమ చేస్తున్నట్లు తెలిపారు. వడ్డీ రాయితీ నిధులు మంజూరు చేయడం పట్ల మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వాయిదాల చెల్లింపు సక్రమంగా ఉంటే చాలు

మహిళా సంఘాల సభ్యులు బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి ద్వారా రుణాలు తీసుకుంటారు. వీటిని సద్వినియోగం చేసుకుని వివిధ ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించి వడ్డీతో కలిపి బ్యాంకులకు వాయిదాలను



చెల్లిస్తుంటారు. వాయిదాల చెల్లింపు సక్రమంగా ఉంటే ఏటా వారు కట్టిన వడ్డీని ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుంది. దీనివల్ల మహిళా సంఘాలకు సున్నా వడ్డీతో రుణాలు అందించినట్లవుతుంది.

జిల్లాలోని 10,805 సంఘాలు వడ్డీ రాయితీకి అర్హత సాధించగా రూ.20.35 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ సంఘాల్లో 1,65,000కుపైగా సభ్యులున్నారు. అర్హులైన వారికి రూ.3 లక్షల నుంచి రూ.10లక్షల దాకా రుణాలిస్తున్నారు. గతంలో చెల్లింపుల్లో అక్రమాలు చోటుచేసుకున్నా ఇప్పుడు అధికారుల చర్యలతో పారదర్శకత పెరిగింది. లోపాలు తగ్గాయి. ఇదే సమయంలో మహిళల్లో బాధ్యత మరింత పెరిగింది.


సున్నా వడ్డీకే తీసుకుంటున్న రుణాలతో మహిళలు ఆర్థికంగా బాగుపడుతున్నారు. తమకాళ్లపై తాము నిలబడేందుకు అధికారులు శిక్షణ కూడా ఇస్తుండటంతో నేర్చుకుని ఉపాధిలో ఉన్నతంగా ఎదుగుతున్నారు. కేవలం కుట్లు, అల్లికలు, కిరాణా దుకాణాలు, బుట్టల అల్లకం వంటి చిన్న చిన్న వాటికే పరిమితం కావడంలేదు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ వంటివి కూడా చేపడుతూ తాజాగా బస్సులను కూడా తీసుకుని నడిపించే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందుకు ప్రభుత్వం వీరికి పూర్తి అండగా నిలుస్తోంది.

# చివరి అంకం.. ఆటంకం

హైదరాబాద్: హెచ్ఎండీఏ పరిధిలో అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ ద్వారా ఇప్పటివరకు రూ.97 కోట్లు ఫీజుల రూపంలో సమకూరింది. 500 వరకు ప్రొసీడింగ్స్ జారీ చేశారు. ఈ నెల 31తో రాయితీ గడువు ముగియనుంది. సర్వర్‌డౌన్ కావడంతో గురువారం ఈ ప్రక్రియకు ఆటంకం ఏర్పడింది. హెచ్ఎండీఏలోని ఏడు జిల్లాల పరిధిలో 3.5 లక్షల మంది దరఖాస్తు చేశారు. నిర్ణీత గడువు నాటికి లేఅవుట్లలో 10 శాతం ప్లాట్లు రిజిస్ట్రేషన్ అయిన వాటిని ప్రస్తుతం ఎల్ఆర్ఎస్ కిందకు తీసుకొచ్చారు.

**అంచనా తలకిందులు**

ఒక్క హెచ్ఎండీఏ పరిధిలో కనీసం రూ.ఐదారు వందల కోట్లు గరిష్ఠంగా రూ.వేయి కోట్ల ఆదాయం సమకూరుతుందని భావించినా వివిధ కారణాలతో లక్ష్యం నెరవేరడం లేదు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియ



మొత్తం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్(సీజీజీ) నిర్వహిస్తోంది. తరచూ సాంకేతిక కారణాలతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఫీజు చెల్లించిన తర్వాత చాలామంది దరఖాస్తుదారులకు సంబంధించి ప్లాట్ల సమాచారం ఎర్రర్ కింద చూపుతుండటంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలు తమ దరఖాస్తు ఉందా....తాము చెల్లించిన ఫీజు మొత్తం ఏమైందని ప్రశ్నిస్తున్నారు.

**స్పందన అంతంతే..**

మార్చి 31లోగా పథకం వినియోగించుకునే వారికి ఎల్ఆర్ఎస్ ఫీజుతోపాటు ఓపెన్ స్పేస్ ఛార్జీల్లో 25 శాతం రాయితీ ప్రకటించినా ఇప్పటివరకు అనుకున్న స్పందన కనిపించలేదు. ఈ నేపథ్యంలో రాయితీ గడువు పెంచుతారా లేదా అనేది చూడాలని హెచ్ఎండీఏ వర్గాలు అంటున్నాయి. గడువు మరికొంత కాలం పెంచే అవకాశం ఉందని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి. కొన్ని లేఅవుట్ల పరిధిలో 200 మీటర్లలోపు చెరువులు, నీటి కుంటలు లేనప్పటికీ ఎల్1 కేటగిరి కింద పెండింగ్‌లో పెట్టారు. సిబ్బంది కొరత, ఇతరత్రా కారణాలతో వీటి పరిశీలనలో జాప్యం జరుగుతోంది. ఒకే సర్వే నంబరు, పక్కపక్కనే ఉన్న ప్లాట్లకు సంబంధించి మార్కెట్ ధర వేర్వేరుగా ఉండటంతో ఫీజులు అధిక మొత్తంలో ఉంటున్నాయి. సాంకేతిక కారణాలతో ఇలా జరుగుతోందని అధికారులు చెబుతున్నారు.

# కాలుష్య ఉద్గారాలు.. ఆ'గాలి'


హైదరాబాద్: కాలుష్య ఉద్గారాల స్థాయి పెరిగే కొద్దీ పీల్చే గాలి ప్రాణాంతకం అవుతుందని సెంటర్ ఫర్ సైన్ అండ్ ఎన్విరాన్‌మెంట్(సీఎస్ఈ) నిపుణులు హెచ్చరించారు. వాహనాల వల్ల పెరుగుతున్న కాలుష్యంతో అనారోగ్య సమస్యలతో పాటు ఆయువుపై ప్రభావం చూపుతుందని వెల్లడించారు. లాన్సెట్ నివేదిక, 'ఎక్స్‌పోజర్ టు వెహికిల్ ఎమిషన్స్ ఇన్‌టేక్ ఫ్రాక్షన్' ఆధారంగా హైదరాబాద్, బెంగళూరు, అహ్మదాబాద్, చెన్నై, ముంబయి, దిల్లీ, కోల్‌కతా నగరాల్లో వాహన కాలుష్యం పెరుగుతోందన్నారు. ఫలితంగా పీఎం 2.5 సూక్ష్మ ధూళి కణాల స్థాయి పెరిగి అనారోగ్యంతో పాటు మరణాలు సంభవిస్తున్నాయన్నారు. లాన్సెట్ నివేదిక ప్రకారం కాలుష్యం కారణంగా సంభవించే మరణాల్లో దిల్లీలో 11.2శాతం, వారణాసి 10.2, కోల్‌కతా 7.3, పుణె 5.9, హైదరాబాద్, ముంబయి, అహ్మదాబాద్ నగరాల్లో 5.6శాతం మరణాలు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. **నియంత్రణే ప్రధానం..**వాహనాల ఉద్గారాలను నిత్యం తనిఖీ చేసుకొని పీయూసీ సర్టిఫికెట్ తీసుకోవాలని సీఎస్ఈ నిపుణులు వెల్లడించారు. కాలం చెల్లిన వాటిని తుక్కుగా మారుస్తూ, ఇంధన వినియోగాన్ని తగ్గించాలి. రెట్రోఫిట్‌పై (విద్యుత్ బ్యాటరీతో నడిచే వాహనాలుగా మార్చడం) వాహనదారులకు అవగాహన కల్పిస్తూ ప్రత్యామ్నాయ ఇంధన వినియోగం వైపు మళ్లించాలని సూచించారు. **పౌరుల భాగస్వామ్యం ముఖ్యమే**కాలుష్య ఉద్గారాలకు అడ్డుకట్ట వేయాలంటే నియంత్రణే ముఖ్యమని ఇందులో పౌరుల భాగస్వామ్యం అవసరమని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ నిపుణులు సూచించారు.

# కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం.. మంత్రులతో చర్చించిన సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: కంచ గచ్చిబౌలి పరిధిలోని భూముల వ్యవహారం, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)లో ఆందోళనలు, తాజా పరిణామాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరా తీశారు. ప్రస్తుత పరిస్థితులపై అందుబాటులో ఉన్న మంత్రులతో సీఎం చర్చించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్కతో సీఎం సమీక్షించారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కంచ గచ్చిబౌలిలోని సర్వే నంబరు 25లో 400 ఎకరాలపై యాజమాన్య హక్కులు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానివేనని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇప్పటికే స్పష్టం చేశారు. దీనిపై హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో వేసిన వ్యాజ్యాలపై పోరాడి కాంగ్రెస్ ప్రభుత్వం హక్కులు దక్కించుకుందని పేర్కొన్నారు. ఈ భూమిలో ఒక్క అంగుళం కూడా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందినది లేదని పేర్కొన్నారు. ఈ భూమికి సంబంధించి సృష్టించే ఎటువంటి వివాదమైనా కోర్టు ధిక్కరణ కిందకే వస్తుందన్నారు. కంచ గచ్చిబౌలి భూముల వివాదం నేపథ్యంలో హెచ్‌సీయూ వద్ద మంగళవారం ఉద్రిక్తత నెలకొంది. ఆ భూములను పరిరక్షించాలంటూ పెద్ద ఎత్తున విద్యార్థులు ఆందోళనకు దిగారు. హెచ్‌సీయూ మెయిన్ గేట్ వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. హెచ్‌సీయూని సందర్శించేందుకు బయల్దేరిన భాజపా నేతలను సైతం పోలీసులు అడ్డుకున్నారు. హెచ్‌సీయూ సందర్శనకు అనుమతి లేదంటూ పోలీసులు వారిని అరెస్టు చేశారు.

**హైకోర్టులో వట ఫౌండేషన్ పిల్..** కంచ గచ్చిబౌలి భూములపై హైకోర్టులో పిల్ దాఖలైంది. జాతీయ ఉద్యానవనంగా ప్రకటించాలంటూ వట ఫౌండేషన్ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసింది. అత్యవసర విచారణకు స్వీకరించాలని ఫౌండేషన్ తరఫు న్యాయవాది కోరారు. దీనిపై బుధవారం విచారణ చేపడతామని హైకోర్టు తెలిపింది.




హైదరాబాద్: అటవీ లక్షణాలు కలిగిన ఏ భూమినైనా కేంద్ర ప్రభుత్వ ఆమోదం లేకుండా నరికివేయొద్దంటూ సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. కంచ గచ్చిబౌలిలో తెలంగాణ ప్రభుత్వం వేలం వేయాలనుకున్న 400 ఎకరాల భూమి అటవీ పరిధిలోనిదని చెప్పారు. ఈ మేరకు ఎక్స్‌లో ఆయన పోస్ట్ చేశారు. “కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమికి సంబంధించిన వివాదంపై హైకోర్టులో కేసు నడుస్తోంది. ఓ ఎన్జీవో దాఖలు చేసిన పిటిషన్‌పై ఏప్రిల్ 7 నాటికి కౌంటర్ దాఖలు చేయాలని ఉన్నత న్యాయస్థానం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆ భూములు వేలం వేయడం కుదరదు. ఈ విషయం తెలిసినా ప్రభుత్వం భూముల చదును పేరుతో కోర్టు ధిక్కరణకు పాల్పడుతోంది. మొక్కలు, చెట్లను తొలగిస్తూ పర్యావరణ విధ్వంసానికి పాల్పడుతోంది. ఆ భూములను డీఫారెస్టేషన్ చేసి అమ్మకాల ద్వారా రూ.కోట్లు దండుకోవాలనుకోవడం దుర్మార్గం. భారాస ప్రభుత్వాన్ని మించి కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోంది. ప్రజా ప్రయోజనాలకు కాకుండా ప్రభుత్వ భూములను అడ్డగోలుగా విక్రయించడాన్ని రేవంత్ రెడ్డి గతంలో వ్యతిరేకించిన సంగతి మర్చిపోయారా? కంచ గచ్చిబౌలి భూముల విక్రయం కాంగ్రెస్ అవకాశవాద రాజకీయాలకు పరాకాష్ఠ. తక్షణమే ఆ భూముల అమ్మకంపై ప్రభుత్వం తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి. లేనిపక్షంలో తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు” అని బండి సంజయ్ అన్నారు.

# హెచ్‌సీయూ భూములను ప్రభుత్వం లాక్కోవట్లేదు: మహేశ్ కుమార్‌గౌడ్



హైదరాబాద్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) భూములను రాష్ట్ర ప్రభుత్వం లాక్కోవడం లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. హెచ్‌సీయూ భూములకు బదులుగా ఎప్పుడో ప్రభుత్వ భూములు ఇవ్వడం జరిగిందన్నారు. అప్పటినుంచి ఇప్పటివరకు అవి ప్రభుత్వ భూములేనని మహేహ్‌కుమార్ గౌడ్ తేల్చి చెప్పారు. ఈ మేరకు గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు కోర్టు కేసు ఉన్నందువల్ల ఆ భూమిని రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోలేదన్నారు. కోర్టు కేసు అయిపోయినందున భూములను స్వాధీనం చేసుకుంటామని వెల్లడించారు.




హైదరాబాద్: కంచ గచ్చిబౌలి భూముల వివాదం నేపథ్యంలో హెచ్‌సీయూ వద్ద ఉద్రిక్తత నెలకొంది. ఆ భూములను పరిరక్షించాలంటూ పెద్ద ఎత్తున విద్యార్థులు ఆందోళనకు దిగారు. హెచ్‌సీయూ మెయిన్ గేట్ వద్దకు చేరుకుని నిరసన తెలుపుతున్నారు. మరోవైపు యూనివర్సిటీ లోపలికి వెళ్లేందుకు బీజేవైఎం, ఏబీవీపీ, వామపక్షాల నేతలు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకుని పీఎస్‌లకు తరలించారు.

# నాగర్‌కర్నూల్ సామూహిక అత్యాచార ఘటన.. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ: ఐజీ



ఊర్కొండ: నాగర్‌కర్నూల్ జిల్లాలో దైవదర్శనానికి వచ్చిన భక్తురాలిని మూడు గంటలపాటు హింసించి.. సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఊర్కొండపేటలో అత్యాచార ఘటనాస్థలిని మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ మంగళవారం పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కేసుకు సంబంధించిన పలు కీలక విషయాలు తెలిపారు. “అత్యాచారం కేసులో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నాం. మహిళలు ఒంటరిగా రావడాన్ని నిందితులు అదునుగా తీసుకున్నారు. వారికి కఠినంగా శిక్ష పడేలా చర్యలు తీసుకుంటాం. అవసరమైతే ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపిస్తాం. బెదిరించి దోపిడీలకు పాల్పడినట్లు నిందితులపై గతంలో కేసులున్నాయి. పార్కులకు వచ్చే మైనర్లను బెదిరించి డబ్బులు లాక్కునేవారు. ఎవరెవరి వద్ద నిందితులు డబ్బులు లాక్కున్నారో వివరాలు సేకరిస్తాం. జాతరలు జరిగే ఆలయాల వద్ద గస్తీ పెంచుతాం” అని ఐజీ సూచించారు.




ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. అమెరికా ప్రతీకార సుంకాల భయాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ముఖ్యంగా ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాల ఒత్తిడితో సూచీలు భారీగా కుదేలయ్యాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ ఏకంగా 1400 పాయింట్లకు పైగా క్షీణించగా. నిఫ్టీ 23,200 మార్క్ దిగువకు చేరింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.3.5 లక్షల కోట్లు క్షీణించి రూ.409 లక్షల కోట్లకు పరిమితమైంది. సెన్సెక్స్ ఉదయం 76,882.58 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,414.92) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 75,912.18 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1390.41 పాయింట్ల నష్టంతో 76,024.51 వద్ద ముగిసింది.

నిఫ్టీ సైతం 353.65 పాయింట్ల నష్టంతో 23,165 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో ఇండస్ ఇండ్ బ్యాంక్, జొమాటో మినహా మిగిలిన అన్ని షేర్లూ నష్టాల్లో ముగిశాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 75.12 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 3160 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

**మార్కెట్ల పతనానికి కారణాలు ఇవే..** ప్రతీకార టారిఫ్‌లపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏప్రిల్ 2న తుది నిర్ణయాన్ని ప్రకటించనున్న నేపథ్యంలో సూచీలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. దేశీయ ఐటీ కంపెనీలకు అమెరికా నుంచే ప్రధానంగా ఆదాయం వస్తుంది. అలాంటిది అమెరికాలో ఐటీకి ఆశించిన మేర డిమాండ్ ఉండకపోవచ్చన అంచనాలతో ఐటీ స్టాక్స్‌లో అమ్మకాలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా ఇన్ఫోసిస్, ఎల్అండ్‌టీ, హెచ్‌సీఎల్ షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఇటీవల 70 డాలర్ల వద్ద ట్రేడయిన బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర మళ్లీ 75 డాలర్ల స్థాయికి చేరింది. భారత్ చమురును ప్రధానంగా దిగుమతి చేసుకొనే దేశం కావడంతో మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఇటీవల దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలైన సెన్సెక్స్, నిఫ్టీ వరుసగా 8 సెషన్లలో దాదాపు 5 శాతానికి పైగా పెరిగాయి. మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం కూడా మరో కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ షేర్లలో అమ్మకాలు సూచీలను పడేశాయి.

**వొడాఫోన్ ఐడియా షేర్లు 20 శాతం జంప్...** వొడాఫోన్ ఐడియాలో వాటాను పెంచుకునేందుకు ప్రభుత్వం అనుమతించడంతో ఆ టెలికాం కంపెనీ షేర్లు నేడు 20 శాతం మేర రాణించాయి.

స్పెక్ట్రమ్ కోసం వొడాఫోన్ ఐడియా చెల్లించాల్సిన మొత్తానికి సంబంధించి తాజాగా ఈక్విటీ షేర్లను ప్రభుత్వానికి కేటాయిస్తున్నట్లు సంస్థ తెలిపింది. వొడాఫోన్ ఐడియాలో ప్రభుత్వానికి 22.6% వాటా ఉండగా.. అది తాజాగా 49 శాతానికి పెరిగింది. ఈ నేపథ్యంలో వొడాఫోన్ ఐడియా షేర్లు ఎన్ఎస్ఈలో రూ.1.37 శాతం లాభంతో 8.17 వద్ద (20.15 శాతం) ముగిశాయి.





చండీగఢ్: పంజాబ్‌కు చెందిన ప్రముఖ మతబోధకుడు, సోషల్‌మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ బాజిందర్ సింగ్‌కు అత్యాచారం కేసులో శిక్ష పడింది. 2018లో ఓ యువతిపై లైంగిక వేధింపులకు పాల్పడినందుకు గానూ ఇటీవల అతడిని దోషిగా తేల్చిన మొహాలీ కోర్టు.. తాజాగా శిక్ష ఖరారు చేసింది. బాజిందర్ సింగ్‌కు జీవితఖైదు విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న మరో ఐదుగురిని న్యాయస్థానం నిర్దోషులుగా తేల్చింది. బాజిందర్ సింగ్ తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని జిరాక్‌పుర్‌కు చెందిన ఓ మహిళ 2018లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. విదేశాలకు తీసుకెళ్తానని ఆశపెట్టి అతడు తనను ఇంటికి ఆహ్వానించాడని బాధితురాలు తెలిపింది. అక్కడ తనపై లైంగిక దాడికి పాల్పడి.. ఆ దృశ్యాలను రికార్డ్ చేశాడని ఆరోపించింది. అతడి డిమాండ్లకు అంగీకరించకపోతే ఆ వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తానని బెదిరించినట్లు తెలిపింది. ఆమె ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ఇటీవల దిల్లీ ఎయిర్‌పోర్టులో అతడిని అరెస్టు చేశారు. అనంతరం విచారణ జరిపిన కోర్టు.. అతడిని దోషిగా తేల్చి జీవితఖైదు విధించింది.

**ఎవరీ సింగ్..?...** హరియాణాకు చెందిన బాజిందర్ సింగ్ ఓ జాట్ కుటుంబంలో జన్మించాడు. 2012లో మతబోధకుడిగా మారాడు. జలంధర్, మొహాలీలలో ప్రార్థనా మందిరాలు ఏర్పాటు చేశాడు. అనతికాలంలోనే పాపులర్ అయిన సింగ్‌కు సోషల్ మీడియాలోనూ లక్షలాది ఫాలోవర్లు ఉన్నారు. అయితే, ఇతడిపై గతంలో అనేక ఆరోపణలు వచ్చాయి. అనారోగ్యంతో బాధపడుతున్న తమ కుమార్తెకు నయం చేస్తానని డబ్బులు తీసుకున్నట్లు దిల్లీకి చెందిన దంపతులు 2022లో కేసు పెట్టారు. 2023లో సింగ్‌పై ఆదాయపు పన్ను సోదాలు కూడా చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో కపుర్తలాకు చెందిన మరో యువతి అతడిపై లైంగిక వేధింపుల ఆరోపణలు చేస్తూ పోలీసులను ఆశ్రయించింది. దీంతో అతడిపై పలు కేసులు నమోదయ్యాయి.

ఈ క్రమంలోనే ఇటీవల బాజిందర్‌కు సంబంధించిన ఓ వీడియో వైరల్‌గా మారింది. తన ఆఫీసులో ఉన్న వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. వాళ్లపై వస్తువులు విసిరేస్తూ హంగామా సృష్టించాడు. అక్కడితో ఆగకుండా ఓ యువకుడితోపాటు మహిళలపైనా చేయి చేసుకున్న దృశ్యాలు బయటికొచ్చాయి.

# కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం.. పార్లమెంట్‌లో లేవనెత్తిన తెలంగాణ భాజపా ఎంపీలు



దిల్లీ: హైదరాబాద్‌లోని కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారాన్ని తెలంగాణ భాజపా ఎంపీలు పార్లమెంట్ ఉభయసభల్లో ప్రస్తావించారు. ఎంపీ లక్ష్మణ్ రాజ్యసభ జీరో అవర్‌లో ఈ విషయాన్ని లేవనెత్తారు. 400 ఎకరాల హెచ్‌సీయూ భూముల అమ్మకాన్ని అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం టీజీఐఐసీ ద్వారా భూముల అమ్మకానికి సిద్ధమైందని, విశ్వవిద్యాలయానికి కూటాయించిన భూములను కాపాడాలని కోరారు. యూనివర్సిటీకి కేటాయించిన భూములను మార్కింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీలు కోరారు. ఇదే అంశంపై లోక్‌సభ జీరో అవర్‌లోనూ తెలంగాణ ఎంపీలు లేవనెత్తారు. అనంతరం కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌ను కలిశారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్, నగేశ్ తదితరులు ఉన్నారు.


# హెచ్‌సీయూ సందర్శనకు బయల్దేరిన భాజపా నేతల అరెస్టు




హైదరాబాద్, నారాయణగూడ: కంచ గచ్చిబౌలిలోని భూవివాదం నేపథ్యంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీని సందర్శించేందుకు బయల్దేరిన భాజపా నేతలను పోలీసులు అడ్డుకున్నారు. హెచ్‌సీయూ సందర్శనకు అనుమతి లేదంటూ పోలీసులు వారిని అరెస్టు చేశారు. హైదర్‌గూడ ఎమ్మెల్యే క్వార్టర్స్ వద్ద భాజపా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో స్వల్ప తోపులాట చోటు చేసుకుంది. మరోవైపు హెచ్‌సీయూ సందర్శనకు పిలుపునిచ్చిన భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని పోలీసులు గృహనిర్బంధం చేశారు. బంజారాహిల్స్‌లోని ఆయన ఇంటి ఎదుట పోలీసులు మోహరించారు.

# రైల్ రోకో ఘటన.. కేసీఆర్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ

హైదరాబాద్: తెలంగాణ ఉద్యమ సమయంలో రైల్‌రోకో ఘటనలో నమోదైన కేసును కొట్టివేయాలంటూ భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్ దాఖలు చేసిన పిటీషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. 2011 అక్టోబర్ 15న ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో భాగంగా సికింద్రాబాద్‌లో రైల్‌రోకో చేపట్టారు. ఆ సమయంలో కేసు నమోదు చేసి పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు ప్రస్తుతం ప్రజాప్రతినిధుల కోర్టులో పెండింగ్‌లో ఉంది. కేసీఆర్ పిలుపు మేరకే రైల్‌రోకో చేపట్టారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టుకు తెలిపారు. అయితే, రైల్‌రోకో జరిగిన సమయంలో అక్కడ కేసీఆర్ లేరని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. వాదనలు విన్న న్యాయస్థానం.. రైల్‌రోకో ఘటన గురించి పోలీసులకు ఫిర్యాదు చేసిన వ్యక్తికి నోటీసులివ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణ వాయిదా వేసింది.



PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660